ప్రతిధ్వనించిన తారకమంత్రం

శ్రీరామ రామేతి రమే రామే మనోరమే.. సహస్ర నామతత్తుల్యం రామనామ వరాననే.. అంటూ తారకనామంతో రాముని స్తుతించి పులకించారు భక్తులు. శ్రీరామ.. జయరామ.. జయజయ రామ.. అంటూ దశరథ సుతుని, సీతాపతిని స్మరిస్తూ భజనలు, సంకీర్తనలు ఆలపించారు. భారీ స్క్రీన్లలో ప్రతిష్ఠాపన ఉత్సవం చూస్తూ తమ అంతరంగంలో రాముని నిక్షిప్తం చేసుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నసమారాధనలు నిర్వహించారు. జై శ్రీరామ్ నినాదాలతో ర్యాలీలు నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు అర్చకులు అక్షింతలను అందజేశారు.

- రామ నామస్మరణతో పులకించిన భక్తులు
- బాలరాముని ప్రతిష్ఠ వేళ మిన్నంటిన సంబరాలు



గ్రీన్‌సిటీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో రంగులతో తీర్చిదిద్దిన శ్రీరాముని చిత్రం


కణితి కాళింగవీధి రామాలయంలో ప్రత్యేక పూజలందుకున్న సీతారాములు


గ్రీన్‌సిటీలో శోభాయాత్రలో కలశాలతో పాల్గొన్న మహిళలు


ప్రసాద వితరణ చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి


డ్రైవర్స్ కాలనీలో యువకుల బైక్ ర్యాలీ

గాజువాక: అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠను గాజువాకలో పండగలా నిర్వహించారు. రామాలయాల్లో హనుమాన్ ఆలయాలలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు.

- పాతకర్ణవానిపాలెం రామాలయంలో బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీరాముడి శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో నాయకులు సిరసపల్లి నూకరాజు, కరణం కనకారావు, రోహిణి తదితరులు పాల్గొన్నారు.
- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దీసంకొండ కృష్ణంరాజు ఆధ్వర్యంలో రామభక్తులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నంది అవార్డు గ్రహీత జి.ఎల్.నాయుడు శ్రీరాముని వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. డ్రైవర్స్ కాలనీ రామాలయంలో విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు డి.రామరాజు, వి.సాంబరాజు, కె.ఆర్.కె.రాజు, వర్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.
- వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో పలు కార్యక్రమాలను నిర్వహించారు. దీపాలంకరణ, రామలక్ష్మణుల వేష ధారణలతో ఆకట్టుకున్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించారు.

కనులపండువగా శోభాయాత్ర

పెదగంట్యాడ: 77వ వార్డు పిట్టవానిపాలెంలో రామాలయంలో ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. 74వ వార్డు దయాల్ నగర్ భక్తాంజనేయ ఆలయంలో అర్చకుడు సీతాపతిశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. భక్తులు జెండాలతో శోభాయాత్ర నిర్వహించారు. 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు పూజల్లో పాల్గొన్నారు.

- 75వ వార్డు నెల్లిముక్కు రామాలయంలో కార్పొరేటర్ పులి లక్ష్మీబాయ్ పూజలు చేశారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు.
- 76వ వార్డు వాసవీ కన్యకా పరమేశ్వరీ పంచాయతన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోపాలరెడ్డి నగర్‌లో మహిళలు కోలాటంతో ఆకట్టుకున్నారు.

1200 కేజీల ప్రసాద వితరణ

గాజువాక: గాజువాక వర్తక సంఘం ఆధ్వర్యంలో శ్రీరామ అఖండ భజన, ప్రసాద వితరణ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొన్నారు. వాసవీ ఆర్యవైశ్య అన్నపూర్ణ నిత్యాన్నదాన పథకం సభ్యులు ఏర్పాటు చేసిన 1200 కేజీల ప్రసాద వితరణ చేశారు. కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, వర్తక సంఘం అధ్యక్షుడు తిప్పల నితీష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కులుకూరి మంగరాజు, నిర్వాహకులు నంబూరు జగన్నాథరావు, కేశారపు శ్రీను రమేష్, కోట పెద వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రామాలయాల్లో ప్రత్యేక పూజలు

కూర్మన్నపాలెం: 87వ వార్డు కణితి కాళింగవీధిలో గల రామాలయంలో పూజలు నిర్వహించారు. కారుమూరి కాంప్లెక్స్‌లో ఎమ్మెస్ పాలెక్ ఆధ్వర్యంలో శ్రీరాముని చిత్రపటానికి పూజలు చేశారు.

- గ్రీన్‌సిటీ శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీరాముడి చిత్రాన్ని రంగులతో తీర్చిదిద్దారు. సాయంత్రం ఏర్పాటు చేసిన శోభాయాత్రలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కలశాలతో శ్రీ సీతారాములు విగ్రహాలను ఊరేగించారు.

స్టీల్‌ప్లాంట్‌లో..

ఉక్కునగరం: అయోధ్యలో రామమందిరం ప్రారంభ కార్యక్రమం సందర్భంగా బాల రాముని ప్రతిష్ఠ వేళ స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు దరి శివాలయంలో శ్రీరాముడికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయ స్వామి మంటపం ఎదురుగా శ్రీరామునికి ప్రత్యేక మంటపం ఏర్పాటు చేసి సీతారాములకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులు వడపప్పు, పానకం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నాగేశ్వర శర్మ, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సత్యసాయి మందిరంలో..

ఉక్కునగరం: సత్యసాయి సేవ మరియు ఆధ్యాత్మిక కేంద్రంలో సీతా రాముల విగ్రహాలను పట్టుకుని జైశ్రీరామ్ నినాదాలతో మందిరం చుట్టూ ఊరేగించారు. ప్రత్యేక భజనలు చేశారు. అష్టోత్తర పూజ, తులసీ పూజలు చేశారు. జయ కామేశ్వరి ఆధ్వర్యంలో శ్రీరామరక్ష స్తోత్ర నామ రామాయణం, హనుమాన్ చాలీసా పఠించారు. వి స్టీల్ మహిళా సమితి అధ్యక్షురాలు నుపుర్ భట్, సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర భజనలు, సాంస్కృతిక కార్యక్రమాల కన్వీనర్ ఎం.ఎస్ ప్రకాశరావు దంపతులు, ఉక్కు విశ్రాంత డైరెక్టర్ ఎస్.ఎస్. రావు, సమితి కన్వీనర్ జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- సెక్టార్–11 వరసిద్ధి వినాయక పూజా కమిటీ ఆధ్వర్యంలో సాయంత్రం ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. సాయంత్రం జై శ్రీరామ్ అలంకరణతో దీపాలు వెలిగించారు. కమిటీ ప్రతినిధులు నాగభూషణం, ఎస్.ఎస్.రెడ్డి, రవివర్మ, కొమ్మినేని శ్రీనివాసరావు, జెర్రిపోతుల మోహనకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంతా రామమయం

అగనంపూడి: 85వ వార్డు అగనంపూడి నిర్వాసిత కాలనీ దానబోయినపాలెంలోని రామాలయంలో భజన మండలి సారథ్యంలో భక్తి గీతాలను ఆలపించారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, జనసేన గాజువాక ఇన్‌చార్జ్ కోన తాతారావు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఎల్.వి.రమణ, దుల్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- అగనంపూడి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుందరాకాండ పారాయణం, హనుమాన్ చాలీసా చదివి వినిపించారు. ఏబీఎస్ పాఠశాలలో పూజలు చేశారు.
- పాత అగనంపూడిలోని కోదండ రామాలయంలో బొర్రమాంబ పారాయణ సేవా సమితికి చెందిన 50 మంది మహిళలు విష్ణు సహస్ర నామాలు, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కొండయ్యవలస రామ మందిరంలో మహిళలు, భజన బృందాలు పారాయణ చేశారు.
- అగనంపూడి షిర్డీ సాయిబాబా మందిరంలో సీతారాములు, ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. శ్రీరామ రక్ష స్తోత్రం, లలిత సహస్ర నామం, హనుమాన్ చాలీసా పఠనం చేశారు ఆలయ కమిటీ ప్రతినిధులు కొయ్య రమణారెడ్డి, డి.వ్యాసశర్మ తదితరులు పాల్గొన్నారు. సద్గురు పాదుకా క్షేత్రం ఆశ్రమ నిర్వాహకులు వి.పూర్ణచంద్రరావు, లక్ష్మి దంపతులు నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.
- 79వ వార్డు అగనంపూడి జాబిలీహిల్స్ గేటెడ్ కమ్యూనిటీ ఆవరణలోని సీతారాముల ఆలయంలో అసోసియేషన్ సారథ్యంలో పూజలు చేశారు. ఎల్‌ఈడీ తెరపై అయోధ్యలో జరిగిన రాముని ప్రాణ ప్రతిష్ఠా మహోత్సవాన్ని తిలకించారు. తరువాత అన్న సమారాధన చేపట్టారు. కమిటీ ప్రతినిధులు వీరునాయుడు, మూర్తి, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నసమారాధన

అక్కిరెడ్డిపాలెం: మిందిలోని కోదండ రామాలయంలో 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాతృమూర్తి గుడివాడ నాగమణ, ఆయనా సతీమణి గుడివాడ హిమ గౌరి, కుటుంబసభ్యులు భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) పాల్గొన్నారు. అక్కిరెడ్డిపాలెం రామాలయంలో, తుంగ్లాంలోని కోదండ రామాలయం వద్ద అన్నసమారాధన చేశారు.


పాతకర్ణవానిపాలెంలో శోభాయాత్ర


మింది రామాలయం వద్ద అన్నప్రసాదం వడ్డిస్తున్న గుడివాడ నాగమణి, హిమ గౌరి తదితరులు


ఉక్కు శివాలయంలో శ్రీరాముడికి పూజలు చేస్తున్న భక్తులు


దయాల్ నగర్ భక్తాంజనేయ ఆలయంలో అక్షింతలు స్వీకరిస్తున్న భక్తులు


నెల్లిముక్కు రామాలయం వద్ద బైక్ ర్యాలీ


అక్కిరెడ్డిపాలెం రామాలయంలో టీవీని వీక్షిస్తూ భజనలు చేస్తున్న భక్తులు


ఉక్కు సత్యసాయి మందిరంలో విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు


ఉక్కు సెక్టార్-11లో దీపారాధనలో పాల్గొన్న మహిళలు


అగనంపూడి కోదండ రామాలయంలో పారాయణం చేస్తున్న మహిళా బృందం


జాబిలీహిల్స్‌లో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని స్క్రీన్‌లో వీక్షిస్తున్న భక్తులు


షిర్డీ సాయి ఆలయంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న పూర్ణచంద్రరావు

క్లుప్తంగా

పేదలకు దుప్పట్ల పంపిణీ


పేదలకు దుప్పట్లు అందజేస్తున్న కార్పొరేటర్ గుడివాడ అనూష, లతీష్ దంపతులు

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జన్మదినోత్సవం సందర్భంగా 68వ వార్డు మిందిలో పేదలకు దుప్పట్లు అందజేశారు. కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ చేతుల మీదుగా వీటిని అందించి, పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ గుడివాడ అప్పలరామ్మూర్తి, నాయకులు, గుడివాడ అప్పన్న మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అండిబోయిన లక్ష్మికి ఆత్మీయ సత్కారం


లక్ష్మిని సత్కరిస్తున్న యాత సంఘం నాయకులు

పెదగంట్యాడ: యాత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమితులైన అండిబోయిన లక్ష్మిని ఆ సంఘం నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాత కార్పొరేషన్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్న తనను యాత సేవా సంఘం అధ్యక్షురాలిగా నియమించడంతో తన బాధ్యతలు మరింత పెరిగాయన్నారు. యాత సామాజికవర్గానికి చెందిన వారి అభ్యున్నతి కోసం పాటు పడతానని చెప్పారు. కార్యక్రమంలో చోడి ఆదినారాయణ, అంగటి రాము, గొర్లె సూరిబాబు, అండిబోయిన అప్పారావు, బాడితబోయిన రాములప్పడు తదితరులు పాల్గొన్నారు.

గిడుగు రామమూర్తికి నివాళి


గిడుగు రామమూర్తి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న లైబ్రేరియన్ రమణ, పాఠకులు

పెదగంట్యాడ: తెలుగు భాషా పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శాఖా గ్రంథాలయ అధికారి రమణ అన్నారు. తెలుగులో వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు వర్ధంతిని స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

శ్రమించే ఉద్యోగులకు గుర్తింపు


ప్రసాదబాబును సత్కరిస్తున్న అధికారులు, సహోద్యోగులు

ఉక్కునగరం: సంస్థ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఉద్యోగులకు ఎల్లవేళలా గుర్తింపు లభిస్తుందని స్టీల్‌ప్లాంట్ ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్ ఎలక్ట్రికల్ ఇన్‌చార్జి జె.కె. శర్మ అన్నారు. విభాగంలో 35 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకుని ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న టి.ఎ. ప్రసాదబాబును సోమవారం స్టీల్‌క్లబ్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసాదబాబు సేవలను శర్మ, విజిలెన్స్ అధికారి బి.జోన్స్‌బాబు కొనియాడారు. కార్యక్రమంలో అధికారులు ఎస్.ఎల్.ఎస్. రావు, జె.మానవేంద్రనాథ్, శ్రీ రమణ, ప్రేమ్‌కుమార్, రాంప్రసాద్, పి. శ్రీనివాసరావు, కార్మిక నాయకులు ఉండవల్లి శ్రీనివాసరావు, గంగవరం గోపి, ఎన్.వి.పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 66వ వార్డులో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన


అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: నియోజకవర్గంలో యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులను చేపడుతున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 66వ వార్డు సీతారామ్‌నగర్‌లో రూ.30 లక్షలతో చేపట్టనున్న రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతనిచ్చామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) మాట్లాడుతూ ఎమ్మెల్యే నాగిరెడ్డి ఆధ్వర్యంలో గాజువాకలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయి, ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, పెదిరెడ్ల ఈశ్వరరావు, షఫీ, సుబ్బారెడ్డి, ఖాజా, దేముడుబాబు, రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, వరలక్ష్మి, ఉమాదేవి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

88వ వార్డులో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

అగనంపూడి: అభివృద్ధి పనులు చకచకా సాగుతున్నాయని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. 88వ వార్డు గంగవరంలో రూ.29లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే కొత్తూరు జంక్షన్ నుంచి నంగినారపాడు హైస్కూల్ వరకు రహదారిని రూ.ఏడున్నర కోట్లతో విస్తరణ పనులు జరుగుతున్నాయని, దాదాపు పనులు పూర్తి కావచ్చాయని చెప్పారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులు కూడా త్వరితగిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి ముత్యాలు, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గండ్రెడ్డి కనక మహాలక్ష్మినాయుడు, మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, నాయకులు మాటూరి అప్పారావు, ఎం.రాజు, జి.బోరయ్య, దాడి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

షీలానగర్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న విద్యుత్ అధికారులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ సబ్ స్టేషన్‌లో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సూపరింటెండింగ్ ఇంజినీర్ (ఆపరేషన్స్) ఎల్.మహేంద్రనాథ్ సోమ వారం ప్రారంభించా రు. ఆయన మాట్లాడు తూ రూ. 1.80 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ వల్ల షీలానగర్, వెంకటేశ్వర కాలనీ, గవర జగ్గయ్యపాలెం, హరిజన జగ్గయ్యపాలెం, పోర్టు రోడ్డు ఏరియాల్లో లో ఓల్టేజీ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. జోన్–2 ఈఈ బి.కె.నాయుడు, ఈఈ ఎం.శ్రీనివాసరావు, ఈఈ రాజ్‌కుమార్, గాజువాక డిప్యూటీ ఈఈ సీహెచ్.మీనకేతన రావు, ఇన్‌చార్జి ఏఈఈ రామకృష్ణ, పలువురు ఏఈలు పాల్గొన్నారు.

డీసీసీబీ ఉద్యోగుల క్రికెట్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ త్రిష్టా మైదానంలో సోమవారం సహకార బ్యాంక్ క్రికెట్ పోటీలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకారం బ్యాంక్ ఆధ్వర్యంలో సహకార ఉత్సవం 2.0 కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా విశాఖ రీజియన్ పరిధిలోని విశాఖపట్నం, తూర్పుగోదావరి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల డీసీసీబీ బ్రాంచీల ఉద్యోగులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు కోలా గురువులు పోటీలను ప్రారంభించారు. పోటీల్లో విజయనగరం జిల్లా జట్టుపై విశాఖపట్నం జిల్లా జట్టు విజయం సాధించింది. బ్యాంక్ సీఈవో డి.వి.ఎస్. వర్మ, బ్యాంక్ డీజీఎం ఎం.అశోక్ కుమార్, ఆప్కాబ్ ఏజీఎం వి.వరుణ్‌తో పాటు నాలుగు జిల్లాల బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

'రోజుకో ఉత్తర్వుతో కార్మికుల్లో ఆందోళన'

ఉక్కునగరం: రోజుకో ఉత్తర్వు జారీ చేయడం ద్వారా యాజమాన్యం కార్మికులను భయాందోళనకు గురిచేస్తోందని స్టీల్ సీఐటీయూ నాయకులు తెలిపారు. దీనిని మానుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఎ.కె. సోఫ్టీను యూనియన్ నాయకులు సోమవారం కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. గత 30 ఏళ్లగా పనిచేస్తున్న కార్మికులను మెడికల్ అన్‌ఫిట్ పేరుతో విధుల నుంచి తొలగిస్తామని చెప్పడం అర్థం లేని చర్య అన్నారు. ఏకపక్ష నిర్ణయాల ద్వారా యాజమాన్యం కార్మికులపై క్రమశిక్షణ పేరుతో తీసుకునే చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై సీజీఎం మాట్లాడుతూ ఈ విషయాలను ఉన్నత యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, మిత్రపక్షాల నాయకులు డి.వి.రమణారెడ్డి, కర్రా ప్రకాశ్, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

బొత్స ఝూన్సీని కలిసిన చందు, కార్పొరేటర్లు


బొత్స ఝూన్సీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చందు తదితరులు

గాజువాక: వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం సమన్వయకర్త బొత్స ఝూన్సీని ఆ పార్టీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు), పలువురు కార్పొరేటర్లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్ప గుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్పొరేటర్లను, గాజువాక ప్రాంత వైఎస్సార్‌సీపీ నాయకులను చందు ఆమెకు పరిచయం చేశారు. ఝూన్సీని కలిసినవారిలో కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, మహ్మద్ ఇమ్రాన్, నాయకులు కోమటి శ్రీనివాసరావు, గుడివాడ లతీష్, సిరట్ల శ్రీనివాస్ తదితరులున్నారు.

వీసీ ప్రసాదరెడ్డికి అభినందనలు : ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా నియమితులైన ప్రసాదరెడ్డిని గాజువాక వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉరుకూటి చందు, కార్పొరేటర్లు, నాయకులు అభినందించారు. అనంతరం ఆయన చందును శాలువాతో సత్కరించారు.

కార్మిక వర్గాన్ని దెబ్బకొట్టే యత్నమే ప్రైవేటీకరణ


దీక్షలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలనే ఆలోచనతోనే ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చిందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. ఉక్కు ఉత్పత్తిని నిలిపివేసి, ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడమే కాక సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1075వ రోజు సంస్థకు చెందిన ఈఎస్ఎఫ్, ఈఆర్ఎస్, ఈఎండీ, సేఫ్టీ విభాగాల కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. యాజమాన్య వైఖరికి నిరసనగా ఈ నెల 29, 30 తేదీల్లో సమ్మె చేపడుతున్నామని, కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ప్రారంభం


కంటి ఆస్పత్రిని ప్రారంభిస్తున్న దొరైస్వామి

గాజువాక: శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి ఆస్పత్రి గాజువాక సెంటర్‌ను బ్రాండిక్స్ ఇండియా భాగస్వామి దొరై స్వామి సోమవారం ప్రారంభించారు. సమాజానికి శంకర్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను అభినందించారు. ఆస్పత్రి జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్ మాట్లాడుతూ ఆస్పత్రిలో రెండు అల్ట్రా మోడ్రన్ ఆపరేషన్ థియేటర్లు, 20 పడకల సౌకర్యం, అత్యాధునిక రోగ నిర్ధారణ సౌకర్యం, ల్యాబ్, ఫార్మసీలను అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం (మెడికల్) డాక్టర్ ప్రకాష్, జీఎం (మెడికల్) డాక్టర్ సారంగి, శంకర్ ఫౌండేషన్ ట్రస్టీలు కృష్ణ కుమార్, విజయ్ కుమార్, డాక్టర్లు, డీజీఎం(పీఆర్) కె.బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.